ప్రసన్నగిరికి మార్గం సుగమం

- జీవీఎంసీ సహకారంతో కొండపైకి రహదారి నిర్మాణం
- దాతల విరాళాలతో ఆలయ అభివృద్ధి



ప్రత్యేక అలంకరణలో ప్రసన్న వేంకటేశ్వరుడు



ప్రసన్న గిరికి నూతనంగా నిర్మించిన మార్గం

అక్కిరెడ్డిపాలెం: గాజువాకవాసులకు చిన్న తిరుపతిగా ప్రసిద్ధి చెందిన ప్రసన్న వేంకటేశ్వరాలయం కొత్త సొబగులతో ముస్తాబవుతోంది. భెల్ సిగ్నల్ పాయింట్ వద్ద గల ఈ ఆలయానికి గతంలో సరైన మార్గం లేక భక్తులు ఇబ్బంది పడేవారు. ఆ సమస్య తీరి, రాకపోకలకు మార్గం సుగమం కావడంతో పాటు ఆలయాన్ని అభివృద్ధి చేస్తుండటంతో భక్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఉద్యోగులు నిర్మించిన ఆలయం

ప్రస్తుత బీహెచ్ఈఎల్ 1976లో బీహెచ్‌పీవీగా ఉన్న సమయంలో సంస్థ ఉద్యోగులు ప్రసన్న గిరిపై బాల వినాయక స్వామి ఆలయం నిర్మించారు. అనంతరం 1986లో దాసాంజనేయ స్వామి, ప్రసన్న వేంకటేశ్వరాలయాలు నిర్మించారు. మహిమ గల స్వామిగా పేరు పొందడంతో గాజువాక పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు ఆలయాన్ని సందర్శించేవారు. ఆలయాలు బాగా ప్రాచుర్యం పొందడంతో 2002లో దేవదాయ శాఖ పరిధిలోకి వెళ్లాయి. అప్పటి నుంచి పరిపాలన బాధ్యతను ఆ శాఖే నిర్వహిస్తోంది.

వసతుల కల్పన

ఆలయ అభివృద్ధికి నూతన ఆలయ పాలక మండలి ఎంతో కృషి చేస్తోంది. జీవీఎంసీ సహకారంలో కొండ పైకి నడక మార్గం, వాహనాలు నేరుగా కొండపైకి వెళ్లేందుకు మార్గాన్ని ఏర్పాటు చేయడంతో భక్తులు సంతోషిస్తున్నారు. ఈ మార్గం వృద్ధులకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని తెలిపారు. దాతల సహకారంతో ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నారు. ఆలయ ప్రారంభంలోని బాల వినాయకుడి ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఆలయంలో మొజాయిక్ ఫ్లోర్, కళాకృతులతో స్తంభాలను ఏర్పాటు చేశారు. ప్రసన్న వేంకటేశ్వరాలయం చుట్టూ భక్తుల ప్రదక్షిణకు అనువుగా ఉండేలా మొజాయిక్ ఫ్లోర్‌ను ఏర్పాటు చేయడంతో పాటు ఎండావానల నుంచి రక్షణ కోసం కొత్తగా షెడ్లు నిర్మించారు.



ప్రదక్షిణ మార్గంలో నిర్మించిన షెడ్



బాల వినాయకుడి ఆలయంలో కొత్త స్తంభాలు, మొజాయిక్ ఫ్లోర్

ఆలయ అభివృద్ధికి కృషి



ఆలయం ఎంతో ప్రశస్తమైనది, కానీ చాలా సమస్యలున్నాయి. దీంతో నూతన పాలకమండలి సభ్యులందరం సమావేశమై ఆలయ అభివృద్ధికి దాతల సహకారం తీసుకోవాలని భావించాం. ఎంతో మంది దాతలు ముందుకు రావడం మా సంకల్పానికి శక్తినిచ్చింది. అలా సమకూర్చిన నిధులతో ఆలయ అభివృద్ధి సాధ్యమైంది.

–గంట్రెడ్డి రామునాయుడు, ఆలయ పాలక మండలి చైర్మన్

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అగనంపూడి: జీవీఎంసీ 79, 85 వార్డుల్లో విస్తరించి ఉన్న అగనంపూడి ప్రాంతంలో, అలాగే 88వ వార్డు పరిధి దువ్వాడ, పరిసర ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఆర్ఈసీఎస్ ఈఈ రామకృష్ణ తెలిపారు. అగనంపూడి ఇండోర్ 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గొల్లవానిపాలెం, యాతపాలెం, శనివాడ 11కేవీ ఫీడర్ల సామర్థ్యం పెంపుదల నేపథ్యంలో జాతీయ రహదారి క్రాసింగ్‌తో పనులు ముడిపడి ఉన్నాయన్నారు. ఈ కారణంగా అగనంపూడి, దువ్వాడ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

విండ్‌బాల్ క్రికెట్ పోటీల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కరణంరెడ్డి

గాజువాక: శ్రీ పోలమాంబ యూత్ ఆధ్వర్యంలో ఈ నెల 12 నుంచి 15 వరకు నిర్వహించనున్న జిల్లాస్థాయి విండ్‌బాల్ క్రికెట్ పోటీల పోస్టర్‌ను బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు గురువారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ పోటీలను నిర్వహించడం హర్షణీయమన్నారు. పోటీల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విజేత జట్లకు వరుసగా రూ.20వేలు, రూ.12వేలు, రూ.8వేల నగదు బహుమతిని అందిస్తారని చెప్పారు. 15న రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో యూత్ ప్రతినిధులు, స్థానిక నాయకులు మజ్జి జగదీష్, గొంతిన సురేష్, గొంతిన అశోక్, సందీప్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు శ్రీరామ పాదుకల దర్శనం

పెదగంట్యాడ: అయోధ్య శ్రీరామ పాదుకల భారతదేశ సందర్శన యాత్రలో భాగంగా శ్రీరాముని పాదుకలను 76వ వార్డు హెచ్‌బీ కాలనీ సమీపంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి పంచాయతన ఆలయంలో శుక్రవారం ప్రదర్శించనున్నారు. అయోధ్య భాగ్యనగర శ్రీ సీతారామ సేవా ఫౌండేషన్ ప్రతినిధి చల్లా శ్రీనివాస్ శాస్త్రి పర్యవేక్షణలో సాయంత్రం 5 గంటల నుంచి 8 గంటల వరకు ఆలయంలో పాదుకల ప్రదర్శన ఉంటుంది. భక్తులు సంప్రదాయ దుస్తుల్లో వచ్చి దర్శించుకోవాలని ఆలయ కమిటీ ప్రతినిధులు ఎం.త్రిమూర్తులు, కొల్లా అప్పలరాజు, ముత్యాలశెట్టి, వెంకటేశ్వరరావు, వెంకటేశ్వర్లు కోరారు.

ఉక్కు ఉద్యోగులకు వేతన ఒప్పందం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న పాండే

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ అధికారులు, కార్మికులకు వెంటనే వేతన ఒప్పందం చేయాలని బీఎంఎస్ స్టీల్ ఫెడరేషన్ తీర్మానం చేసింది. స్థానిక అంబేడ్కర్ కళాక్షేత్రంలో మూడు రోజుల పాటు నిర్వహించిన ఫెడరేషన్ సమావేశంలో గురువారం రెండు తీర్మానాలు చేశారు. అసంతృప్తితో ఉన్న ఉద్యోగులకు వేతన ఒప్పందం చేయాలని, సుమారు 20 ఏళ్లుగా అన్‌స్కిల్డ్‌గా ఉండి, సాంకేతిక అర్హత ఉన్న కాంట్రాక్ట్ కార్మికులకు స్కిల్డ్ కార్మికులుగా పదోన్నతి కల్పించాలని తీర్మానాలు చేశారు. సమావేశంలో వక్తలు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ విరమించి ప్రత్యామ్నాయంగా సెయిల్‌లో విలీనం చేయాలన్నారు. ఈ తీర్మానాలను కేంద్ర ఉక్కు మంత్రి జ్యోతిరాదిత్య సింధియాకు పంపుతామని స్టీల్ బీఎంఎస్ అధ్యక్షుడు కొమ్మినేని శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో బీఎంఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు రాజ్ బిహారి శర్మ, ఉప ప్రధానకార్యదర్శి సురేంద్ర కుమార్ పాండే, నాయకులు ఎం.వి.ఎస్. నాయుడు, రాందాస్ నరేంద్ర, హనుమంతరావు, శ్రీనివాసరెడ్డి, శేషు, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష' గ్రాండ్ సక్సెస్

- ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి
- నియోజకవర్గంలో 106 శిబిరాల నిర్వహణ
- దరఖాస్తుదారులకు 87,931 ధ్రువపత్రాల పంపిణీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

పెదగంట్యాడ: జగనన్న సురక్ష కార్యక్రమం చరిత్రాత్మకమని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఈ కార్యక్రమం గ్రాండ్ సక్సెస్ అయిందన్నారు. స్థానిక బీసీ రోడ్డులోని టీఎస్సార్ ఫంక్షన్ హాల్లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశంలోనే ఏ రాష్ట్రంలో లేనివిధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈ కార్యక్రమాన్ని అమలు చేసి, అందరి మన్ననలు అందుకున్నారన్నారు. గత నెల 1 నుంచి 31వరకు నిర్వహించిన ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభించిందని తెలిపారు. అర్హత ఉన్న ఏ ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరం కాకూడదనే సదుద్దేశంతో ఇటువంటి బృహత్తర కార్యక్రమాన్ని ప్రజల ముందుకు తీసుకొచ్చారన్నారు. ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్లకు సంబంధించిన సమస్యలను సత్వరం పరిష్కరించి ధ్రువపత్రాలను ఉచితంగా అందజేశారని చెప్పారు. గాజువాక నియోజకవర్గంలో సచివాలయ సిబ్బంది పూర్తిస్థాయిలో పనిచేసి 106 క్యాంపులను పెట్టి 87,931 ధ్రువపత్రాలు జారీ చేశారని వివరించారు. ధ్రువీకరణ పత్రాలు మినహా ఇతర అంశాలను ప్రత్యేకంగా నమోదు చేసుకున్నారని, ఆ సమస్యలను కూడా పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్ రెడ్డి, డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పల్లా చినతల్లి, కార్పొరేటర్లు తిప్పల వంశీరెడ్డి, మహ్మద్ ఇమ్రాన్, నాయకులు మార్టుపూడి పరదేశి, వెంపాడ అప్పారావు, నక్క వెంకటరమణ, మంత్రి శంకరనారాయణ, గొందేశి వెంకటరమణారెడ్డి, దొడ్డి రమణ, బొడ్డ గోవింద్, ఒమ్మి ఈశ్వరి, ఉమ, గొరుసు రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఇది పేదల ప్రభుత్వం



సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న పెందుర్తి ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పెదగంట్యాడ: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. గత నాలుగేళ్లలో అనేక సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారులకు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 77వ వార్డులోని పిట్టవాని పాలెం, మరడ దాసరిపేటలో ఆయన పర్యటించారు. కార్పొరేటర్ బట్టు సూర్యకుమారితో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, ప్రజలకు చేకూరిన లబ్ధి గురించి వివరించారు. ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హతే ప్రాతిపదికగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నారని తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అవినీతి, అక్రమాలకు తావులేకుండా పాలన సాగిస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో వార్డు నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటర్ల సర్వే



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మారెడ్డి

గాజువాక: గాజువాక నియోజకవర్గంలో ఓటర్ల సర్వేను పారదర్శకంగా నిర్వహిస్తున్నామని ఓటర్ల నమోదు అధికారి డి.లక్ష్మారెడ్డి తెలిపారు. జీవీఎంసీ గాజువాక జోనల్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత నెల 21 నుంచి ఇప్పటి వరకు నిర్వహించిన డోర్ టు డోర్ సర్వే ప్రగతిని ఈ సందర్భంగా వివరించారు. ఈ సర్వేలో గుర్తించిన డబుల్ ఎంట్రీలు, శాశ్వతంగా వలస వెళ్లిన ఓటర్లు, చనిపోయిన వారి వివరాలతో పాటు అర్హుల వివరాలతో కూడిన జాబితాలను నాయకులకు అందజేశారు. ఫారం 6, 7, 8లను దరఖాస్తు చేసే విధానంపై అవగాహన కల్పించారు. వైఎస్సార్‌సీపీ, టీడీపీలనుంచే ఇప్పటివరకు బీఎల్ఏల జాబితాను అందించారని, ఇతర గుర్తింపు పొందిన పార్టీల నాయకులు కూడా తమ బీఎల్ఏల జాబితాలను అందజేయాలని కోరారు. వలంటీర్లను ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేయవద్దని ఆదేశించారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ పి.సింహాచలం, ఈఈ ప్రసాద్‌బాబు, టౌన్‌ప్లానింగ్ డీసీపీ పద్మజ, ఏసీపీ మహాపాత్రో, గాజువాక, పెదగంట్యాడ తహసీల్దార్లు పాల్ కిరణ్, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు సీఐ కౌన్సెలింగ్



ఆటోడ్రైవర్లతో మాట్లాడుతున్న దువ్వాడ సీఐ శ్రీనివాసరావు

కూర్మన్నపాలెం: ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలని, సత్ప్రవర్తనతో మెలగాలని దువ్వాడ శాంతిభద్రతల సీఐ శ్రీనివాసరావు సూచించారు. దువ్వాడ రైల్వేస్టేషన్ 4వ ప్లాట్‌ఫాం వైపు ఉన్న ఆటో డ్రైవర్లు ఆర్టీసీ డ్రైవర్‌ను తీవ్ర పదజాలంతో దూషించిన సంఘటనపై స్పందించిన ఆయన ఆటోడ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆర్టీసీ బస్సులకు, ఇతర వాహనాలకు ఇబ్బంది లేకుండా ఆటోలను నడపాలని తెలిపారు. ఆటోలను ఎక్కడ పడితే అక్కడ నిలిపి, ఇతరులకు అంతరాయం కలిగించకూడదన్నారు. రెండు, మూడు ఆటోలకు ఒకే నంబర్ అంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఇతర సిబ్బంది, ఆటోడ్రైవర్లు పాల్గొన్నారు.

వంతెన తొలగించాలని నిరసన

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు వెంకటేశ్వర కాలనీ వద్ద కల్వర్టుపై అక్రమంగా నిర్మిస్తున్న వంతెనను తొలగించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. వంతెన వద్ద గురువారం నిరసన తెలిపారు. బీజేపీ కన్వీనర్ కరణం రెడ్డి నర్సింగరావు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో 400 పడకల ఈఎస్ఐ ఆస్పత్రికి కేంద్ర ప్రభుత్వం రూ.384 కోట్లు కేటాయించిందన్నారు. వెంటనే ఆస్పత్రి పనులు పూర్తి చేసి లక్షలాది మంది కార్మికులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అప్పలరాజు, శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, పేర్ల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

తిరుమల బాలాజీకి పట్టువస్త్రాల సమర్పణ



ట్రస్ట్ సభ్యులకు పట్టు వస్త్రాలను అందజేస్తున్న భక్తులు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో స్వామికి భక్తులు పట్టు వస్త్రాలను సమర్పించారు. గురువారం సాయంత్రం షీలానగర్‌కు చెందిన బాల సత్య అప్పల త్రిమూర్తులు, రాజేశ్వరి దంపతులు, పార్వతి, ప్రమీలారాణి రెండు పట్టు పంచెలు, నాలుగు పట్టు చీరలను దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధులకు అందజేశారు.

జిప్సా కార్యాలయానికి స్థలం కోసం వినతి



సుబ్బారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న జిప్సా ప్రతినిధులు

గాజువాక: గాజువాక పారిశ్రామికప్రాంత ప్రైవేట్ పాఠశాలల సంక్షేమ సంఘం (జిప్సా) కార్యాలయానికి స్థలం కేటాయించాలని ఆ సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు వారు గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డితో కలిసి వైఎస్సార్‌సీపీ ప్రాంతీయ సమన్వయకర్త వై.వి.సుబ్బారెడ్డికి గురువారం వినతిపత్రం సమర్పించారు. సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పాలవలస భాస్కరరావు, బి.శ్రీనివాసరావు తమ సంఘం కార్యకలాపాలను వివరించారు. గాజువాకలో సుమారు 200 చిన్న, మధ్యతరగతి పాఠశాలలతో జిప్సా కార్యకలాపాలను 22 ఏళ్లుగా కొనసాగిస్తోందన్నారు. తమ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు కార్యాలయం కోసం గాజువాకలో స్థలం కేటాయించాలని కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో జిప్సా ప్రతినిధులు శ్రీనివాసరావు, రమణి యాదవ్, వాసుదేవరావు తదితరులున్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

- 87వ వార్డులో రూ.66.89 లక్షలతో పనులు
- 88వ వార్డులో రూ.20లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం



87వ వార్డులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

కూర్మన్నపాలెం: ప్రజల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. జీవీఎంసీ 87వ వార్డు కళింగవీధిలో 19.89 లక్షలు రూపాయల జీవీఎంసీ నిధులతో నిర్మించనున్న వీఆర్‌సీసీ డ్రైనేజీలు, కణితి ముస్లింవీధిలో 41 లక్షల రూపాయలతో రిటైనింగ్ వాల్స్, అదే విధంగా గణేష్‌నగర్‌లో 6 లక్షల రూపాయలతో సీసీ రోడ్లు, కల్వర్టుల నిర్మాణ పనులకు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగిరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో పరుగులు పెడుతోందన్నారు. భవిష్యత్తులో రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా మార్చేందుకు సీఎం ప్రణాళికలు రూపొందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ బొండా జగన్, 87వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు, ప్రగడ వేణుబాబు, ముద్దపు దామోదర్, బొడ్డ గోవింద్, కోమటి రమాదేవి, ఆడారి శ్రీను ఇతర నాయకులు పాల్గొన్నారు.

88వ వార్డులో..

జీవీఎంసీ 88వ వార్డు పరిధి యాదవజగ్గరాజుపేటలో సుమారు 20 లక్షల రూపాయల జీవీఎంసీ నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే నాగిరెడ్డి గురువారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మొల్లి ముత్యాలనాయుడు, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి మహలక్ష్మినాయుడు, నమ్మి ప్రసాద్, మాడిన అప్పలరాజు, ఊరుకూటి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఏలేరు నీరు అందకున్నా.. ఇబ్బంది లేకుండా..

- తొలి రోజు ట్యాంకర్లతో నీటి సరఫరా
- కార్పొరేటర్ల సమన్వయంతో పంపిణీ



70వ వార్డులో ట్యాంకర్ల వద్ద నీటిని పట్టుకుంటున్న మహిళలు

గాజువాక: జీవీఎంసీ గాజువాక జోన్‌లోని వివిధ వార్డులకు నీటి సరఫరా విభాగం అధికారులు ట్యాంకర్లతో నీటి సరఫరా నిర్వహించారు. గాజువాక జోన్‌లోని మంచినీటి శుద్ధి కర్మాగారాలకు నీటిని అందిస్తున్న ఏలేరు ఎడమ కాలువకు భారీ వర్షాల కారణంగా గండి పడటంతో నీటి లభ్యత నిలిచిపోయిన విషయం తెలిసిందే. దీంతో 64, 65, 70, 73 (పార్టు), 74, 75, 76 (పార్టు), 86, 87, 77, 79, 85, 88 వార్డులకు రెండు రోజులపాటు నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ముందుగానే ప్రకటించిన నీటి సరఫరా విభాగం అధికారులు జనం అవస్థలు పడకుండా ట్యాంకర్లతో మంచి నీటిని సరఫరా చేశారు. సరఫరా నిలిచిపోయిన అన్ని వార్డులకు నీరు అందించడం కోసం 12 ట్యాంకర్లను హుటాహుటిన ఏర్పాటు చేశారు. ఆయా వార్డుల కార్పొరేటర్ల సమన్వయంతో నీటి సరఫరా నిర్వహించారు. సిద్ధార్థనగర్ వాటర్‌ప్లాంట్ పరిధిలోని పలు కాలనీలకు నీటిని యథావిధిగా సరఫరా చేశారు. కేబీఆర్ నుంచి రా వాటర్ లభించడంతో ఆగమేఘాలపై శుద్ధి చేసిన సిబ్బంది నిర్దేశిత సమయానుగుణంగా నీటిని అందించారు.

ప్రతీ వార్డుకు ఆరు ట్రిప్పులు

ట్యాంకర్లతో నీటిని పంపించిన వార్డుల్లో కొన్నిచోట్ల సరిగా పంపిణీ జరగలేదన్న ఆరోపణలు రావడంతో అధికారులు అప్రమత్తమై పరిష్కరించారు. ఈ విషయంపై 10ఎంజీడీ వాటర్ ప్రాజెక్టు సహాయ ఇంజినీర్ కేదార్‌నాథ్‌ను సంప్రదించగా, జోన్‌లో అన్ని ప్రాంతాలకు నీటిని పంపిణీ చేశామని తెలిపారు. కార్పొరేటర్లను సమన్వయం చేసుకొంటూ ప్రతీ వార్డుకు ఆరు ట్రిప్పుల చొప్పున నీటిని అందించామన్నారు. కాలువ వద్ద మరమ్మతు పనులు కూడా పూర్తి కావచ్చాయని, శుక్రవారం సాయంత్రానికి పరిస్థితి సాధారణ స్థితికి వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు.

సంపూర్ణ పోషణతో ఆరోగ్యం

గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ పోషణ కిట్ల పంపిణీ



సామూహిక సీమంతాల అనంతరం గర్భిణులతో ఎమ్మెల్యే నాగిరెడ్డి తదితరులు

పెదగంట్యాడ: వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకంతో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సంపూర్ణ ఆరోగ్యం సొంతమవుతుందని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం కింద టేక్ హోం రేషన్ కిట్లను గురువారం ఆయన పంపిణీ చేశారు. టీఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మాతా శిశు మరణాలు చోటు చేసుకోకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ బృహత్తర పథకాన్ని అమలు చేస్తున్నారని తెలిపారు. ప్రతి రోజూ అంగన్వాడీ కేంద్రాలకు వచ్చి పోషకాహారం తీసుకోవడానికి గర్భిణులు, బాలింతలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఇంటికే పోషకాహారాన్ని అందిస్తున్నామని చెప్పారు. ఈ నెల నుంచి ప్రతి నెలా ఇళ్ల వద్దకే రేషన్‌ను అందజేస్తారన్నారు. అనంతరం సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేశారు. చిన్నారులకు అన్నప్రాసన, గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ సింహాచలం, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్ రెడ్డి, డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పల్లా చినతల్లి, ఎంవో డాక్టర్ బద్రీనాథ్, సీహెచ్‌వో నాగ అప్పారావు, సీడీపీవో డాక్టర్ డి.సీలవేణి, ఎంఈవోలు ఇమంది శ్రీనివాసరావు, కె.రమణాజీ, ఏఎస్‌వో తవ్వా కృష్ణ, తనకాల సత్యనారాయణ, కార్పొరేటర్లు తిప్పల వంశీరెడ్డి, మహ్మద్ ఇమ్రాన్, నాయకులు పాల్గొన్నారు.

కార్మికుల పోరాటానికి కేంద్రం తలవంచాల్సిందే..



903వ రోజు దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు పరిశ్రమ కోసం కార్మిక వర్గం చేస్తున్న పోరాటానికి కేంద్ర ప్రభుత్వం తలవంచక తప్పదని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో 903వ రోజు గురువారం సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారాన్ని అమ్మాలనే ఆలోచన వచ్చిన మోదీ ప్రభుత్వానికి ప్రజలు గట్టిగా బుద్ధి చెప్తారన్నారు. బీజేపీ నాయకులు గత ప్రభుత్వ స్కామ్‌ల గురించి గగ్గోలు పెట్టి, అధికారంలోకి రాగానే తమ అనుయాయులైన ఆదానీ, అంబానీలకు కారుచౌకగా ప్రజాసంపదను దోచిపెడుతున్నారని ఆరోపించారు. దేశంలో కొత్త పరిశ్రమలను నెలకొల్పకపోగా, ఉన్న ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్‌పరం చేయడం సరికాదన్నారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రభుత్వరంగ సంస్థగానే కొనసాగుతుందని ప్రకటన చేయాలని, లేదంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

పేదల గృహ నిర్మాణాలకు విశాఖ ఉక్కు వినియోగించాలని వినతి

ఉక్కునగరం: రాష్ట్రంలో చేపడుతున్న పేదల గృహ నిర్మాణాలకు, సెంటు భూమి ఇళ్లకు విశాఖ ఉక్కు కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఉక్కు అధికారుల సంఘం (సీ) నాయకులు రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్‌ను కోరారు. వారు మంత్రిని గురువారం అమరావతిలో కలిసి, ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. వర్కింగ్ క్యాపిటల్ లేకపోవడం వల్ల 16 నెలలుగా 20 లక్షల ఉత్పత్తి సామర్థ్యం ఉన్న ఒక బ్లాస్ట్‌ఫర్నేస్‌ను, సంబంధిత విభాగాలను మూసి వేశారని తెలిపారు. తద్వారా 40 శాతం పైగా ఉత్పత్తి తగ్గిందని, అందువల్ల ఉత్పత్తి వ్యయం పెరిగి నష్టాలు ఎదుర్కోవలసి వస్తోందని చెప్పారు. పూర్తి స్థాయి ప్లాంట్ నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం కనీసం రెండు వేల కోట్లు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. దానికి బదులుగా ప్రభుత్వ నిర్మాణాలకు విశాఖ ఉక్కును వినియోగిస్తే స్టీల్‌ప్లాంట్‌కు మేలు చేసినవారవుతారన్నారు. కార్యక్రమంలో సీ ప్రధాన కార్యదర్శి కె.వి.డి. ప్రసాద్, సంయుక్త కార్యదర్శి నరసింహ, జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'మిస్ ప్రీ టీన్' విజేత ప్రీతి పట్నాయక్



మిస్ ప్రీ టీన్‌గా నిలిచిన ప్రీతి పట్నాయక్

అక్కిరెడ్డిపాలెం: ఆంధ్రప్రదేశ్ 2023 మిస్ ప్రీ టీన్ విజేతగా షీలానగర్‌కు చెందిన ప్రీతి పట్నాయక్ (12) నిలిచింది. విశాఖలోని ఓ ప్రైవేట్ హోటల్లో స్టార్ కిడ్స్ 2023, స్టార్ ఏపీ 2023 ఫ్యాషన్ షో నిర్వహించారు. ఫైనల్‌లో పరిచయం, సంప్రదాయం, నటన విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభను కనబర్చిన ప్రీతి పట్నాయక్ ప్రీ టీన్ ఏపీగా టైటిల్ సాధించింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిగ్ బాస్ ఫేం అనిల్ రాథోడ్ హాజరు కాగా, న్యాయ నిర్ణేతలుగా మిస్టర్ ఒలింపియాడ్ అరుణ్ పాల్, మిస్ ఇండియా 2022 వ్యవహరించారు. విజేతలకు అతిథుల చేతుల మీదుగా క్రౌన్, ప్రశంసాపత్రం, జ్ఞాపికలు అందజేశారు. రాష్ట్రవ్యాప్తంగా 6 ప్రాంతాల్లో నిర్వహించిన ఆడిషన్లలో 5వేల మందికి పైగా పాల్గొనగా, 68మంది తుది పోటీలకు ఎంపికయ్యారని నిర్వాహకులు తెలిపారు. వారికి నగరంలో ఫైనల్స్ నిర్వహించినట్లు చెప్పారు. తమ కుమార్తె మిస్ ప్రీ టీన్‌గా ఎంపిక కావడంతో తల్లిదండ్రులు అనిత, జి.జి. ప్రసాద్ ఆనందం వ్యక్తం చేశారు.